# స్పెయిన్, పోర్చుగల ట్రావెలాగ్

– మల్లాది వెంకట కృష్ణమూర్తి



*(ప్రారంభం)*

**యూరప్‌లో** ఏటా టూరిస్ట్ సీజన్ మేలో ఆరంభమై సెప్టెంబర్ దాకా ఉంటుంది. ఆ ఏడాది యూరప్‌లో మేము చూడని దేశానికి వెళ్ళాలనే ఆలోచనతో, మార్చ్ 2014లో ఓ రోజు మేము బంజారాహిల్స్‌లోని ఎస్.ఓ.టి.సి ట్రావెల్ ఆఫీస్‌కి వెళ్ళాం. వారి సమ్మర్ యూరప్ ట్రిప్స్ బ్రోషర్ని చూస్తే స్పెయిన్, పోర్చుగల్ దేశాలకి కలిపున్న పేకేజ్ మాకు నచ్చింది. అప్పటికే మేము మా పిల్లల దగ్గరకి అమెరికాకి 4 మే వెళ్ళి, 4 ఆగస్ట్‌న తిరిగి ఇండియా వచ్చేందుకు టిక్కెట్లు కొన్నాం. మా అమెరికా ట్రిప్ గురించి అక్కడ పనిచేసే హెప్సిబా రాణికి చెప్పి, ఆగస్ట్, సెప్టెంబర్లలో స్పానిష్ ఫియొస్టాకి బుక్ చేయమని కోరాం.

18 ఆగస్ట్ 2014న స్పెయిన్‌లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన టొమాటినో ఫెస్టివల్ ఉందని బ్రోషర్‌లో చదివాక, దానికి హాజరయ్యేలా బుక్ చేయమని కోరాం. కాని స్పేనిష్ వీసా తీసుకోడానికి కనీసం రెండు వారాల ముందు పాస్‌పోర్ట్ పంపాలని, మేం 4 ఆగస్ట్ తిరిగొచ్చాక 5న ఇచ్చినా 18కల్లా వీసాలతో మా పాస్‌పోర్ట్‌లు స్పేనిష్ ఎంబసీ నించి తిరిగి వస్తాయనే గేరంటీ లేదని ఆమె చెప్పడంతో, తర్వాతి కన్‌ఫర్మ్‌డ్ ట్రిప్పైన 9 సెప్టెంబర్ 2014కి చెరో ఏభైవేలు అడ్వాన్స్ కట్టి బుక్ చేసుకున్నాం. ఒకొక్కరు మొత్తం చెల్లించాల్సింది రూ. 1,72,274.

4 ఆగస్ట్‌న అమెరికా నించి హైదరాబాద్ రాగానే ఆ సంగతి హెప్సిబా రాణికి తెలియచేసాం. 5న వాళ్ళ మనిషి వచ్చి మా ఇద్దరి పాస్‌పోర్ట్‌లు, సపోర్టింగ్ డాక్యుమెంట్స్, బేలన్స్‌కి చెక్స్ తీసుకెళ్ళాడు. 11 ఆగస్ట్ 2014న ఆమె మాకు 9 సెప్టెంబర్ టూర్‌కి ఎమిరేట్స్ టిక్కెట్లని ఇ మెయిల్ చేసింది. దానికి జవాబుగా నేను మాకింకా వీసాలు రాలేదని, అవి రాకపోతే ఈ టిక్కెట్స్ రద్దు చేస్తే కేన్సిలేషన్ సొమ్ము పోతుందా అని మెయిల్ ఇచ్చాను. ఆమె నాకు ఫోన్ చేసి, "మీకు వీసాలు వచ్చాయి. పాస్‌పోర్ట్‌లు బాంబే బ్రాంచ్‌లో ఉన్నాయి. మా చేతికింకా రాలేదు.' అని చెప్పింది. అవి రాగానే మాకు పంపమని, ఫారిన్ ఎక్స్చేంజ్ కొనడానికి అవి అవసరమైతాయని నేను కోరాను. కాని సెప్టెంబర్ ఆరుదాకా మా పాస్‌పోర్ట్స్, టిక్కెట్స్, ట్రావెల్ ఇన్సూరెన్స్ మా చేతికి రాలేదు.

వాళ్ళ మనిషి సెప్టెంబర్ ఆరున మాకా పాస్‌పోర్ట్‌లని తెచ్చిచ్చాక వీసాలని పరిశీలించాను. పృథ్వీ ఫారెక్స్ నించి మా ట్రిప్‌కి చెరో 500 యూరోలు కొన్నాం.

టికెట్స్‌ని ఎమిరేట్స్ సైట్‌లో చెక్ చేస్తే, మా విమానం టిక్కెట్స్ బుక్ చేసిన ఏస్.ఓటిసి బాంబే ఆఫీస్ వారు మా అప్లికేషన్‌లో పేర్కొన్న భోజనం ప్రిఫరెన్స్ వెజిటేరియన్ ఆప్షన్‌ని సెలెక్ట్ చేయలేదు. ఆన్‌లైన్ సరిచేద్దామని ప్రయత్నిస్తే, గ్రూప్ బుకింగ్ అవడంతో సాధ్యపడలేదు. హెప్సిబా రాణికి ఫోన్ చేస్తే ఆమె దొరకలేదు. మేము అమెరికా వెళ్ళేప్పుడు టిక్కెట్స్ బుక్ చేసుకోడానికి స్వయంగా వెళ్ళినప్పుడు మాధవి అనే బుకింగ్ క్లర్క్ పరిచయమైంది. హైదరాబాద్ ఎమిరేట్స్ ఆఫీస్‌కి ఆమెకి ఫోన్ చేస్తే ఆమె మా భోజనం వెజిటేరియన్‌గా మార్చింది. ఇది వెజిటేరియన్స్ తమ టిక్కెట్లో గమనించాలి. లేదా విమానంలో ఇబ్బంది పడాల్సి వస్తుంది.ఎస్.ఓ.టిసి సిబ్బంది చేసే మరో తప్పు, ఇద్దరు వెళ్ళేప్పుడు ట్రావెల్ ఇన్సూరెన్స్ బెనిఫిషియరీగా ఒకరిపేరు మరొకరికి నమోదు చేస్తారు. ఇద్దరికీ ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఇన్సూరెన్స్ కంపెనీ చెల్లించేందుకు సర్వైవర్స్ ఉండరు. అలాంటప్పుడు ఇన్సూరెన్స్ పాలసీకి కట్టే డబ్బు వృధా అవుతుంది హెప్సిబా రాణికి ఫోన్ చేసి, మా ఇద్దరికీ బెనిఫిషియరీగా మా పెద్దమ్మాయి కావ్య పేరుని మార్పించాం. ట్రావెలింగ్ ఏజన్సీ ద్వారా టిక్కెట్స్/ట్రిప్ బుక్ చేసుకునేవారు ఈ రెంటినీ గమనించి తగిన ప్రయోజనం పొందాలి.

మా ప్రయాణం 9వ తారీకు తెల్లవారుఝాము 4.15కి. అందుకు మూడు గంటలముందు, అంటే 1.15 కల్లా ఎయిర్‌పోర్ట్‌లో ఉండాలి. ఇంటినించి 8వ తారీకు రాత్రి 11.45కి బయలుదేరాలి. కాబట్టి ఏడవ తారీకు డాట్ కేబ్‌కి ఫోన్ చేసి, మర్నాడు ఎనిమిదవ తారీకు రాత్రి 11.45కి మాకు ఎయిర్‌పోర్ట్‌కి కేబ్ బుక్ చేయమని కోరాను. కానీ మర్నాడు హైదరాబాద్‌లో వినాయక నిమజ్జనం జరుగుతోంది కాబట్టీ తమ సర్వీస్ లేదని చెప్పారు. మేరూ కేబ్స్‌కి కూడా ఫోన్ చేస్తే వారూ అదే చెప్పారు.

సికింద్రాబాద్‌లోని సెయింట్ ఏన్స్ నించి బయలుదేరే ఏరోబస్ దాకా కారులో వెళ్ళి, అక్కడ నించి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళడం అనే ఇంకో దారి ఉండటంతో, వారి ఆఫీస్‌కి ఫోన్ చేస్తే, ఓ కుర్రాడు అవీ రద్దయ్యాయని చెప్పాడు.

దాంతో మా బంధువు వి.వై.ఎల్.ఎన్ మూర్తిగారికి చెపితే, ఆయన ఓ ప్రైవేట్ టేక్సీని మాట్లాడారు. నిమజ్జనం బళ్ళవల్ల ట్రాఫిక్ ఆంక్షలవల్ల రాత్రి 11.30కి ఎయిర్‌పోర్ట్‌కి వెళ్ళే అన్ని మార్గాల్లో రద్దీ బాగా ఉంటుందని, మధ్యాహ్నం 2.30కి బయలుదేరితే తీసుకెళ్తానన్నాడని చెప్పారు. మెహదీపట్నం నించి టేంక్‌బండ్ దాకా వినాయకుడి వాహనాలు నిమజ్జనానికి ఉదయమే మొదలై తెల్లారుఝాముదాకా కొనసాగుతాయని, అందువల్ల చుట్టూ తిప్పి తీసుకెళ్తాడని, రిటర్న్‌కి కూడా కలిపి 1200రూ ఇవ్వమని, డ్రైవర్ హరి రెండున్నరకల్లా వచ్చి పికప్ చేసి దింపుతాడని మూర్తిగారు చెప్పారు. నిమజ్జనానికి టేంక్‌బండ్ వైపు వెళ్ళే మెయిన్ రోడ్లన్నీ కిక్కిరిసిపోతాయి. మా ఇల్లు టేంక్ బండ్‌కి రెండు కిలోమీటర్లలోపు ఉంటుంది కాబట్టి అవన్నీ మా ఇంటి చుట్టుపక్కల ఉన్న రోడ్లే అందువల్ల శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి మా డిపార్చర్‌కి నాలుగు గంటల ముందు బదులు పధ్నాలుగు గంటల ముందుగా చేరాల్సి వస్తోంది.

***<u>8-9-2014 సోమవారం</u>***

2.45కి ఇంట్లోంచి ఓ చెకిన్ సూట్‌కేస్, రెండు కేరీ ఆన్ సూట్ కేస్‌లతో టేక్సీలో బయలుదేరాం. మెహదీపట్నం వెళ్ళే రోడ్లన్నీ మూసేయడంతో, మా ఇంటినించి రాణిగంజ్, కిమ్స్ హాస్పిటల్, బేగంపేటల ద్వారా రాజ్ భవన్ రోడ్డెక్కి కుడివైపు చిన్న సందుల్లో పోనిచ్చి మెహదీపట్నం బ్రిడ్జ్, పి.వి.నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వేల మధ్యగల సందులోంచి మెయిన్ రోడ్ మీదకి

వచ్చి, మొత్తానికి ఆ ఫ్లై ఓవర్ మీదకి ఎక్కాడు. చాలా పాతకారది. విండో అద్దం దిగక ఉక్కపోత. ఏసి పనిచేయలేదు. ఇంట్లోంచి 2.45కి బయలుదేరితే, ఎయిర్‌పోర్ట్‌కి 4.00కి చేరాం. 45 నిమిషాల ప్రయాణం బదులు రెట్టింపు ప్రయాణమైంది.

ఇంటర్నేషనల్ డిపార్చర్స్ దగ్గర కేబ్ దిగి డ్రైవర్‌కి థాంక్స్ చెప్పి, డబ్బిచ్చి పంపాక అక్కడనించి లిఫ్ట్‌లో సామానుతో కింద ఉన్న ఫుడ్ కోర్ట్‌కి చేరుకున్నాం. ఎందుకంటే ఈ ఇబ్బందికర ప్రయాణం, కేబ్ కోసం ఫోన్ కాల్స్‌తో మధ్యాహ్నం మేం భోజనం చేయలేదు. అక్కడ చాలా రద్దీగా ఉంది. ఇద్దరం మసాలా దోసెని తిన్నాం. డైట్ కోక్ తాగాక, అక్కడ స్వీపర్ని ఖాళీ టిన్ వేయడానికి రీసైకిల్ బిన్ ఎక్కడుందని అడిగితే తనకి తెలియదని చెప్పింది. చూస్తే ఎయిర్‌పోర్ట్ మొత్తానికి అలాంటిది లేదు.

ఫుడ్ కోర్ట్ పక్కన ఏ -1 రూట్ ఏరో బస్ ఆగి, అందులోంచి ప్రయాణికులు దిగడం చూసాను. ఫోన్‌లో నాకు తప్పుడు సమాచారం ఇచ్చారు. బాంబే ద్వారా కువైట్‌కి వెళ్ళాల్సిన విమానాన్ని ఆలస్యంగా వచ్చి మిస్సైన కర్నూలుకి చెందిన ఒకతను తన బాధని వెళ్ళగక్కాడు.

"ఎయిర్‌లైన్స్ వాళ్ళు నాకు ఈ రోజు హైదరాబాద్ ట్రాఫిక్ గురించి మెసేజ్ పంపుంటే ఈ సమస్య ఉండేది కాదు."

సాయంత్రం ఆరుకి లోపలకి వెళ్ళాం. అంత ముందుగా సెక్యూరిటీ వాళ్ళు లోపలికి అనుమతించకపోతే బయటే గడపాలని భయపడ్డాం. కానీ వాళ్ళు మాట్లాడకుండా పంపారు. వెంట తెచ్చుకున్న పుస్తకాలతో పుస్తకప్రియులైన మా ఇద్దరికీ కాలక్షేపానికి ఇబ్బంది లేకపోయింది.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అరగంట ఇంటర్నెట్ కనెక్షన్ దొరికింది. మన ఫోన్ నంబర్‌కి ఎస్సెమ్మెస్ వచ్చిన ఓటిపిని ఫీడ్ చేస్తేనే ఈ సౌకర్యం. ఇంటర్నెట్ స్లోగా ఉన్నా, పద్మజ అమెరికాలోని మా పెద్దమ్మాయి కావ్యతో వాట్సప్ కాల్‌లో మాట్లాడింది. కావ్య ఆఫీస్ పనిమీద పేరిస్ వెళ్తూ, అదే సమయంలో హ్యూస్టన్ ఎయిర్‌పోర్ట్‌లో ఉంది. ముగ్గురు కుటుంబ సభ్యులు ప్రపంచంలోని రెండు ఖండాలనించి మూడో ఖండం యూరప్‌కి ఒకే సమయానికి వెళ్తున్నారు.

ఓ తెలుగు జంట మమ్మల్ని పలకరించి, మొదటిసారి సియాటిల్ వెళ్ళునామని, దుబాయ్‌లో విమానం మారడానికి సహాయం చేయమని కోరితే సరే అన్నాం.

రాత్రి 11.30కి పద్మజ కాఫీ తాగాక ఎమిరేట్స్ కౌంటర్ క్యూలో నిలబడ్డాం. లగేజ్ చెకిన్ చేసి, హైదరాబాద్ నించి దుబాయ్‌కి ఓ బోర్డింగ్ పాస్, దుబాయ్ నించి మాడ్రిడ్‌కి మరో బోర్డింగ్ పాస్ చొప్పున ఇద్దరికీ చెరో రెండు బోర్డింగ్ పాస్‌లని ఇచ్చారు. హైద్రాబాద్ టు దుబాయ్ ఫ్లైట్ నంబర్ ఇకె 0528. దుబాయ్ టు మాడ్రిడ్ ఇకె 0141. ఇమ్మిగ్రేషన్ కార్డ్ ఎలా నింపాలో తెలీని, దుబాయ్‌లో సూపర్ బజార్లో పనిచేసే ఓ ఇరవై ఏళ్ళ కుర్రాడు దాన్ని నింపమని కోరితే, చేతిరాత బావుండే పద్మజ మావాటితోపాటు అతని ఇమ్మిగ్రేషన్ ఫాం కూడా నింపింది. సెక్యూరిటీ చెక్‌లో కేరీ ఆన్ లగేజ్‌లోంచి ఐపాడ్‌ని బయటకి తీయమని కోరారు. ఈ నియమం మేలో మేము అమెరికా వెళ్ళినప్పుడు లేదు. 4 ఆగస్ట్‌న తిరిగి వచ్చేప్పుడు కూడా లేదు. సెక్యూరిటీ చెక్ అయ్యాక కేరీ ఆన్ లగేజ్ టేగ్స్ మీద సెక్యూరిటీ రబ్బర్ స్టాంప్స్ వేసారు. నేను వెళ్ళిన మరే దేశంలో ఈ పద్ధతి లేదు. ఇది అనవసరం. ఎవరైనా సహాయకుడు తన టేగ్‌ని టెర్రరిస్ట్‌కి ఇచ్చి, తన కేరీ ఆన్‌ని

వదిలేయచ్చు. ఎవరు దీన్ని తీసుకెళ్ళారనే లెక్క ఎక్కడా ఉండదు. ఇది గ్రహించి అనుకుంటాను ఇప్పుడీ పద్ధతిని రద్దు చేసారు.

1.30కి డిపార్చర్ లాంజ్‌లోకి వెళ్ళాక ఫుడ్ కోర్టులోని దోస ఫేక్టరీలో చెరో మైసూర్ మసాలా దోస తిన్నాం. వాంగో అనే రెస్టరెంట్లో నేను ఓ ప్లేట్ ఇడ్లీ తిన్నాను. ప్రియా పచ్చళ్ళ స్టాల్ కొత్తగా కనపడింది. పదిరూపాయలు చిన్న పికిల్ పాకెట్స్ 6 వెరైటీలు కొన్నాం. మర్చిపోయిన యాంటి బయోటిక్స్ మెడికల్ షాప్‌లో కొన్నాం. 95.50 అయింది. వందిస్తే చిల్లరలేదని 5రూ వెనక్కి ఇవ్వలేదు. నా ముందున్న ముస్లిం యువతికి కూడా ఇవ్వలేదు. 'రోజుకి ఎంత కలెక్షన్ బాబూ?' అని నవ్వుతూ అడిగితే జవాబు చెప్పలేదు. విదేశాల్లో చిన్న నాణెంతో సహా చిల్లర లెక్కపెడుతూ ఇస్తారు. అనధికారికంగా పావలా, అర్థరూపాయి తొలగించినా, ఇలాంటి చోట్ల స్వచ్ఛందంగా ఐదు రూపాయలని తొలగించి చిల్లర ఇవ్వడంలేదు.

పుల్లారెడ్డి స్వీట్‌షాప్‌లో ట్రిప్‌లో తినడానికి అరకిలో చెక్కలు 22రూకి కొన్నాం. నిజానికి డిపార్చర్ లాంజ్‌లోని పుల్లారెడ్డి, కరాచి బేకరీ, ప్రియ ఫుడ్స్ లాంటి స్టాల్స్‌లో కొంటే, ధర కొంచెం ఎక్కువైనా ఆ బరువుని ఉచితంగా తీసుకెళ్ళచ్చు. మా గేట్ నంబర్ 34Aలో కూర్చున్నవారి దగ్గరకి ఓ అధికారి వచ్చి, అందరి బోర్డింగ్ కార్డ్‌లని చెక్ చేసాడు. ఏదో సమస్య వచ్చిందనుకుంటాను. మా గేట్ నంబర్ 34Bకి మారిందని ప్రకటన వినిపించడంతో అక్కడికి మారాం. 3.45కి బోర్డింగ్ మొదలైంది. ఖతార్ ఎయిర్ వేస్ విమాన ప్రయాణీకులు కూడా మా దాంట్లో ఎక్కారు. రష్ లేక రెండు విమానాల ప్రయాణీకులని ఓ దాంట్లో సర్దారేమో? మా సీట్ నంబర్లు 30E, 30F.

విమానం తలుపు పక్కనే గల్ఫ్ న్యూస్, ది వాల్ స్ట్రీట్ జర్నల్, ది టైమ్స్ ఇంటర్నేషనల్, న్యూయార్క్ టైమ్స్ దినపత్రికల దొంతర కనిపించింది. ఎమిరేట్స్‌లో ఇప్పుడు ఇలా దినపత్రికలు ఉంచడంలేదు. బరువు తగ్గితే ఇంధనం ఖర్చు తగ్గుతుంది.

పావుగంట ఆలస్యంగా మా విమానం 4.30కి బయలుదేరింది. అది బోయింగ్ 777 జెట్ విమానం. సీట్ల వరస 2+4+2. ఎయిర్ హోస్టెస్ చేతులు తుడుచుకునే హాట్ టవల్స్‌ని ట్రేలోంచి పట్కారుతో తీసి అందరికీ ఇచ్చింది.

పైలట్ ప్రకటనలో పదమూడు దేశాలకి చెందిన విమాన సిబ్బంది పదిహేను భాషలు మాట్లాడగలరని చెప్పాడు. హైదరాబాద్ నించి దుబాయ్‌కి 2,540 కిలోమీటర్లు.

టేకాఫ్ అయిన పావుగంటలోనే, మానసికంగా, శారీరకంగా అలసిపోయిన మేము గాఢనిద్రలోకి జారుకున్నాం.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*